సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



మహిళా ఉద్యోగుల హడల్
'పేట' సెర్ప్‌లో మహిళా ఉద్యోగులు ఓ అధికారి పేరు చెబితేనే హడలెత్తిపోతున్నారు.

వివరాలు 8లో ▸



పోటెత్తిన వినియోగదారులు
దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం విని యోగదారులు ఉల్లిని కొనుగోలు చేశారు.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 38.7 /20.7

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

'రాజీవ్ యువవికాసం' మార్గదర్శకాలు విడుదల
స్టేషన్ మహబూబ్‌నగర్: రాజీవ్ యువ వికాసం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు సహాయం అంది స్తుందని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శంక రాచారి బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. రాజీవ్ యువి వికాసం పథకం కింద జిల్లాలోని మైనార్టీ నిరు ద్యోగ యువత ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్వయం ఉపాధి పథకం కింద రేషన్‌కార్డుకు ఒక్కరు మాత్రమే అర్హులన్నారు. ఈ పథకానికి ఆధార్, రేషన్‌కార్డు లేదా ఆదాయం, కుల ధ్రువపత్రా లు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు తప్పనిసరి అన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పిం చిన తర్వాత హార్డ్‌కాపీని ఎంపీడీఓ లేదా ము న్సిపల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మైనార్టీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంతమైన వాతావరణం కల్పిం చడంలో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 30 వరకు జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ జానకి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున డీఎస్పీ లేదా ఇతర పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి లే కుండా ఎలాంటి సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు చేయరాదన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు వంటి పెద్ద సౌండ్ సిస్టమ్స్ ఈ సమ యంలో పూర్తిగా నిషేధించడం జరిగిం దన్నారు. 30 పోలీస్ యాక్ట్‌ను ఎవరైనా ఉల్లం ఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హె చ్చ రించారు. అంతకు ముందు ఎస్పీ జిల్లాకేంద్రం లోని మెట్టుగడ్డ దగ్గర ఉన్న షాసాబ్‌గుట్ట హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అగ్గి.. బుగ్గి

జిల్లాలో ఏటేటా పెరుగుతున్న అగ్ని ప్రమాదాలు



- అపార నష్టాలను మిగిల్చుతున్న ఆయా ఘటనలు
- చాలా మండలాల్లో కనిపించని ఫైర్ స్టేషన్లు
- ప్రమాద తీవ్రత పెంచుతున్న దూరభారం
- 441 గ్రామాలకు నాలుగు వాహనాలే దిక్కు



మంటలు అదుపు చేస్తున్న ఫైర్‌మ్యాన్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: వేసవి కాలం వచ్చేసింది.. రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి.. పెరు గుతున్న వేసవితాపం అగ్ని ప్రమాదాలకు ఆజ్యం పోసేలా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలు సంభవించే అవకాశాలు రెట్టింపు అవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో ఏటా వేసవిలోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఆయా ఘటనలు అపార నష్టాలు మిగుల్చుతున్నాయి. అసలు ప్రమాదాలకే ఆస్కారం లేకుండా అప్రమ త్తమైతే నష్ట తీవ్రతను తగ్గించవచ్చు. ఈ విషయమై జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు ఎప్పటిక ప్పుడు ప్రజలను చైతన్యం చేయడంతోపాటు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలోని అగ్నిమాపక కేం ద్రాల నుంచి ఫైర్ ఇంజిన్లు సంఘటన స్థలాలకు సమయానికి చేరుకోని మంటలు ఆర్పడంపై దృష్టి పెట్టింది. ఒకవేళ జిల్లాలో ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే ఆలస్యం చేయకుం డా టోల్ ఫ్రీ నంబర్లు 101, 100 సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం
అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటులో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రమాదాలు చోటుచేసుకున్నప్పు డల్లా కంటితుడుపు చర్యగా నేతలు, అధికారులు పరామర్శించి వెళ్లిపోతారు. ఎంతోకొంత సాయం అందిస్తారు. త్వరలోనే ఆయా ప్రాంతాల్లో అగ్నిమా పక కేంద్రాలను ఏర్పాటు చేయిస్తామని హామీలు గుప్పిస్తారు. ఆ తర్వాత ఎలాంటి ఉలుకు పలుకు ఉండదు. తిరిగి ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు మళ్లీ మొదటికే వస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పటి నుంచి ఈ కేంద్రాల ఏర్పాటు కలగానే మిగులుతోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ప్రతి నియోజకవర్గానికి ఓ కేంద్రం ఏర్పాటు చేస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. అయినా కేటాయింపులు ప్రతిపాదనలకే పరిమి తమయ్యాయి. కొత్తగా జిల్లాలో దేవరకద్ర నియోజ కవర్గంలోని కొత్తకోటలో ఏర్పాటు చేయగా దీంతో పాటు గండేడ్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి.

తప్పని దూరభారం..
జిల్లాలో 17 మండలాలు ఉండగా.. అందులో అన్ని కొన్ని పెద్దవి, మరికొన్ని చిన్న మం డలాలు ఉన్నాయి. అలాంటి చోట్ల కనీసం ఒక ఫైర్‌స్టేషన్ కూడా లేదు. కొన్ని కేంద్రాలు నాలుగైదు మండలాల్లోని గ్రామాలకు సేవ లందిస్తున్నాయి. గండేడ్, మహమ్మదాబాద్, కోయిలకొండ మండలాల పరిధిలోని గ్రామా లకు మహబూబ్‌నగర్ నుంచి ఫైర్ ఇంజిన్ వెళ్లాల్సి ఉంటుంది. జిల్లాలో చాలా మండ లాల్లోని గ్రామాలకు రోడ్డు వసతి కూడా లేక పోవడంతో ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలానికి చేరుకోవడానికి కనీసం గంటన్నర సమయం పడుతుంది. ఈలోగా ప్రమాదంలో ఆస్తులన్నీ కాలి బూడిదవ్వాల్సిందే. జిల్లాలో మొత్తం 441 గ్రామాలు ఉండగా.. కేవలం నాలుగు వాహనాలే అందుబాటులో ఉన్నాయి.

నీటికి కొరత లేదు..



జిల్లాకు ఇటీవల 90 వేల లీటర్ల ఫైర్ ఇం జిన్ మంజూరు కావ డంతో పాటు ఎమ్మెల్యే నిధుల సహకారంతో ఫైర్ స్టేషన్‌లో బోరు వేయడం వల్ల ఫైర్ ఇంజిన్‌లలో నీటిని నింపు కోవడానికి కొరత లేదు. మూడు ఫైర్ ఇం జిన్లు, ఒక మిస్ట్ జీపు, ఒక బుల్లెట్ అందుబా టులో ఉంది. జడ్చర్లలో ఒక ఫైర్ ఇంజిన్, ఒక బుల్లెట్ ఉంది. అన్ని అడ్వాన్స్ వాహనాలు కావడం వల్ల మల్టీపర్పస్‌కు ఉపయోగిం చవచ్చు. ఇటీవల చిన్న ప్రమాదాల సంఖ్య పెరిగాయి. చిన్న వాటికి బుల్లెట్, మిస్ట్ జీప్‌లు వాడుతున్నాం. వేసవికాలం పూర్తయ్యే వరకు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది, ఇతర అధి కారులు ఏ ఒక్కరు అత్యవసరమైతే తప్ప సెలవు తీసుకోకుండా పనిచేస్తాం. జిల్లాలో ఉన్న ఫైర్ ఇంజిన్స్‌తో బాధ్యతగా పనిచేసి ఎక్కడా ఇబ్బంది రాకుండా చూస్తాం. ప్రస్తుతం వేసవి వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. ముఖ్యంగా బహుళ అంతస్తులు ఉన్న పట్టణా లపై దృష్టిపెడతాం. అలాగే పరిశ్రమలు, ఇతర ప్రమాదకరమైన వాటిపై నిఘా ఏర్పాటు చేస్తాం.

– కిషోర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

రెండున్నరేళ్లలో ఎస్‌ఎల్‌బీసీని పూర్తిచేసి తీరుతాం



ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్ద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- సొరంగంలో ప్రమాద ఘటన బాధాకరం
- 15 రోజుల్లో సహాయక చర్యలు పూర్తి
- మృతుల కుటుంబాలకు త్వరలో పరిహారం
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యల పరిశీలన

అచ్చంపేట/ఉప్పునుంతల: ఎన్ని ఇబ్బందులు ఎదురైనా శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీ సీ)ని రెండున్నరేళ్లలో పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతనెల 22న ప్రమాదం చోటు చేసుకున్న దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ఇన్‌లెట్‌ను బుధవారం సంద ర్శించారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు చేపడుతున్న సహాయక చర్యల గురిం చి ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి, కలెక్టర్ బదా వత్ సంతోష్‌తో మంత్రి తెలుసుకున్నారు. అనం తరం సహాయక బృందాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సొరంగంలో ప్రమాదం చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని.. మరో 105 నుంచి 110 మీటర్ల వరకు మట్టి తవ్వకాలు పూర్తయితే సమస్య ఒకొలిక్కి వస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. గడిచిన 40 రోజుల్లో వివిధ బృ ందాలకు చెందిన 700 నుంచి 800 మంది సహా యక సిబ్బంది, నిపుణులు రాత్రింబవళ్లు పనిచేస్తు న్నారని చెప్పారు. ప్రస్తుతం 550 నుంచి 600 మం ది అత్యాధునిక పరికరాలతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారన్నారు. సొరంగం లోపల భారీ డ్రిల్లింగ్ యంత్రానికి ఇనుము, ఇతర పరికరాలు అతుక్కుపోవడంతో అక్కడ బురద తొలగింపు కష్టంగా, ప్రమాదకరంగా మారిందన్నారు. అయిన ప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సహాయక సిబ్బందికి అసౌ కర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. మరో 15 రోజుల్లో సహాయక చర్యలను పూర్తిచే స్తామన్నారు. ఇప్పటి వరకు రెండు మృతదేహాలు లభ్యం కాగా.. మిగిలిన ఆరుగురి కోసం గాలింపు కొనసాగుతుందన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని చెప్పారు. ఎస్‌ఎ ల్‌బీసీ ప్రాజెక్టు ద్వారా నల్లగొండ, ఖమ్మం జిల్లా లను సస్యశ్యామలం చేస్తామన్నారు. భవిష్యత్‌లో సొరంగం వల్ల ఎలాంటి నష్టాలు జరగకుండా సం పూర్ణ చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వివరిం చారు. జలయజ్ఞంలో భాగంగా దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన సొరంగం పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిచేసేం దుకు కృతనిశ్చయంతో ఉందన్నారు. సమావేశంలో డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, ఎన్‌డీఆర్‌ఎస్ అధికారి డా.హరీశ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి జయప్రకాశ్, దక్షిణమధ్య రైల్వే అధికారి రవీంద్ర నాథ్, నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాసులు, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, జీఎస్‌ఐ అధి కారులు రాజశేఖర్, కాడవర్ డాగ్స్ ప్రతినిధి ప్రభాత్ తదితరులు ఉన్నారు.

లభించని కార్మికుల ఆచూకీ..
ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో 45 రోజుల క్రితం ప్రమాదానికి గురైన కార్మికుల జాడ లభిం చడం లేదు. వారి ఆచూకీ కోసం సహాయక బృందాలు నిరంతరాయంగా శ్రమిస్తున్నా ఫలితం లేకుండాపోతుంది. ఉబ్బికి వచ్చిన నీటితో కూలిన సొరంగం ప్రదేశంలో పేరుకు పోయిన మట్టి, బురద, బండరాళ్ల తొలగింపు నకు మరో 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు సహాయక సిబ్బంది తెలి పారు. ఇప్పటికే టీబీఎం భాగాలు, శిథిలాలు, మట్టి, రాళ్ల తొలగింపు పనులను సహాయక బృందాలు వేగవంతం చేశాయి. సొరంగంలో 10వేల లీటర్లు నీటి ఊట వస్తుండగా.. 2.5 కి.మీ. ఒకటి చొప్పున 150 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన భారీ మోటార్లతో బయటకు పంపింగ్ చేస్తున్నారు. డీ–1 ప్రాం తం వరకు మట్టి తొలగింపు పూర్తి కాగా.. మరో 105 నుంచి 110 మీటర్ల మేర తవ్వ కాలు చేపడితే సమస్య ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

ఘనంగా మహనీయుల జయంతి వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బాబు జగ్జీవ న్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుక లను ఘనంగా నిర్వహించడానికి అందరూ సహ కరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. శని వారం బాబు జగ్జీవన్‌రాం జయంతి, ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ విష యమై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మం దిరంలో ఆయా సంఘాల ప్రతినిధులు, అధికారు లతో సమావేశమై చర్చించారు. గతేడాది కన్నా ఈసారి మరింత ఘనంగా ఉత్సవాలు నిర్వహించేం దుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అం దిస్తామని చెప్పారు. అనంతరం సమావేశానికి హాజరైన పలువురు సంఘాల ప్రతినిధులు మాట్లా డుతూ బాబు జగ్జీవన్‌రాం, అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణతోపాటు ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అంబేడ్కర్ విగ్రహాల పరిర క్షణ తదితర సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అంబేడ్కర్ కళాభవ న్‌లో సమావేశం ఏర్పాటు చేసి భోజనాలు ఏర్పాటు చేయాలని, బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద మెట్లు నిర్మించాలని కోరారు. సమావేశంలో జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతి మేరకే నిర్మాణాలు చేపట్టాలి

- స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్



బహుళ అంతస్తును పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర పరిధిలో ఇళ్లు, బహుళ అంతస్తులు, ఇతర వాణిజ్య సముదా యాలను మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల మేరకే అనుమతి తీసుకుని నిర్మించుకోవాలని ప్రజలకు స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. బుధవారం ఉదయం స్థానిక మైత్రినగర్ నుంచి ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వరకు క్షేత్రస్థాయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ నిర్మాణాలు పూర్తయి ఇంతవరకు ఆస్తిపన్ను చెల్లించని, ఇంటి నంబరు తీసుకొని వారు వెంటనే మున్సిపల్ కార్యాలయం లో అసెస్‌మెంట్ చేసుకోవాలన్నారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రెయినేజీ వ్యవస్థను, తాగునీటి పైపులైన్లలో లీకేజీలను సరిచేయాల న్నారు. స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వని వారిని గుర్తించాలన్నారు. ఎక్కడబడితే అక్కడ వీధుల వెంట, ఓపెన్ ప్లాట్లలో చెత్తాచెదారం వేయొద్దన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, డీఈఈ నరసింహ, ఏఈఈ వైష్ణవి, టీపీఓ లక్ష్మీపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద ర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షపడేలా చూస్తాం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్ క్రైం: ఊర్కొండ మండలం ఊర్కొండ పేటలో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిం దితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్షపడేలా చూస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సభ్యసమాజం తలదించుకునే విధంగా మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డారని అన్నారు. నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి పలు సెక్షన్ల కేసులు నమోదు చేయడంతో పాటు రిమాం డ్‌కు తరలించినట్లు తెలిపారు. నాగరిక సమాజంలో ఇలాంటి ఘటనలను ఎవరు సహకరించరని.. నిం దితులను సమాజం బహిష్కరణ చేస్తుందన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి అన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో భాగం గా జిల్లాలోని ప్రముఖ దేవాలయాలతో పాటు ట్యాంక్‌బండ్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పోలీసు నిఘా, పహారా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలపై అత్యాచారాలు జరగకుండా ఉండాలంటే పోలీసు, ప్రభుత్వ పరం గానే కాకుండా సమాజంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి మానవీయ విలువల్లో మార్పు రావాలని అన్నారు. మహిళలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

బాధితురాలికి రూ.25,000 చెక్కు

కందనూలు: ఊర్కొండపేటలో అత్యాచారానికి గురైన మహిళకు మహిళా, శిశుసంక్షేమ శాఖ నుంచి రూ.25,000 చెక్కు అందించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్ఫేర్ అధికారి రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మామిడి రైతుకు.. మార్కెట్ కష్టాలు

- కొల్లాపూర్‌లో కలగా మారిన మార్కెట్ నిర్మాణం
- పండ్ల విక్రయాలకు రైతులకు తప్పని అవస్థలు
- ప్రైవేటు వ్యాపారుల సిండికేట్‌తో నష్టాలు
- మామిడి మార్కెట్ ఏర్పాటుతోనే రైతులకు మేలు



కొల్లాపూర్‌లో ఏర్పాటుచేసిన ప్రైవేటు మార్కెట్

కొల్లాపూర్: మామిడికి ప్రసిద్ధిగాంచిన కొల్లాపూర్‌లో మార్కెట్ ఏర్పాటు కలగానే మారింది. ఇక్కడ మామిడి సాగు విస్తారంగా ఉన్నప్పటికీ.. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు ప్రైవేటులో విక్ర యించక తప్పడం లేదు. ఈ క్రమంలో ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారి మామిడి ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. దీంతో మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కొల్లాపూర్‌లో మార్కెట్ నిర్మాణానికి మూడేళ్ల క్రితం నిధులు మం జూరయ్యాయి. స్థల సమస్య కారణంగా మార్కెట్ నిర్మాణం జరగడం లేదు. ఫలితంగా రైతులు హైద రాబాద్‌తో పాటు పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్‌లోని ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకే పంటను అమ్ముకుంటున్నారు.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లావ్యాప్తంగా 34,712 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోనే 25,237 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. కొల్లాపూర్ మామిడికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ఇక్కడి పండ్లకు హైద రాబాద్ తదితర ప్రాంతాల్లో గిరాకీ ఉంటుంది. కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కొన్నేళ్లుగా పాలకులను కోరుతున్నారు. గత ప్రభుత్వం కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్ నిర్మాణం కోసం రూ. 5.45 కోట్లు మంజూరు చేసింది. అయితే స్థల సమస్య కారణంగా మార్కెట్ నిర్మాణానికి నోచుకోలేదు.

వ్యాపారుల సిండికేట్‌తో నష్టాలు..

కొన్నేళ్ల క్రితం వరకు కొల్లాపూర్ రైతులు మామిడి పంట అమ్ముకునేందుకు హైదరాబాద్‌కు వెళ్లే వారు. పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్‌లో ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతు లకు కొంతమేర ఉపశమనం లభించింది. అయితే స్థానిక వ్యాపారులు కూడా హైదరాబాద్ సిండికే ట్‌తో కుమ్మక్కై ధరలు అమాంతం తగ్గించేస్తు న్నారు. ప్రతి సంవత్సరం సీజన్ ప్రారంభంలో కొన్ని రోజులు అధిక ధరలు పెట్టి.. ఆ తర్వాత ధర లను తగ్గించేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్యకు మార్కెట్ నిర్మాణం తోనే పరిష్కారం లభిస్తుంది.

స్థల పరిశీలనకే పరిమితం..

కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లి శివారులోని దేవాదాయశాఖ భూమిలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు మొదట అధికారులు శ్రీకారం చుట్టారు. 19 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ ఏర్పాటుచేసి.. అందులోనే కొనుగోళ్లు, మామిడి కాయలు నిల్వ ఉంచేందుకు గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసే విధంగా ప్రతిపాదనలు తయారు చేయించారు. స్థల సేకరణ కోసం దేవాదాయశా ఖకు ప్రభుత్వం ద్వారా లేఖ పంపించారు. అయితే భూ బదాలాయింపునకు దేవాదాయశాఖ అధికా రులు ముందుకు రాలేదు. లీజు ప్రకారం ఇస్తామని చెప్పారు. అది కూడా రెండేళ్లకో సారి రెన్యువల్ చేసుకునేలా ప్రతిపాదనలు చేశారు. మార్కెటిం గ్‌శాఖ అధికారులు ఇందుకు విముఖత వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి గోదా ములు, కొనుగోలు కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసి.. రెండేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి అంటే ఇబ్బందికరంగా ఉంటుందని వారు దేవాదాయశాఖ ప్రతిపాదనలను తిరస్కరిం చారు. కనీసం 20 నుంచి 30 ఏళ్లపాటు లీజుకు ఇస్తేనే మార్కెటింగ్ నిర్మాణాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో రామాపురం శివా రులోని గుట్టపై మార్కెట్ నిర్మాణానికి గల అవకా శాలను పరిశీలించారు. అయితే అక్కడ మార్కెట్ నిర్మాణానికి స్థలం అనువుగా లేదని ఇంజినీరింగ్ అధికారులు నివేదిక ఇవ్వడంతో అక్కడ కూడా నిర్మాణం జరగలేదు. చివరగా కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాల సమీపంలో 14 ఎకరాల విస్తీ ర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమిలో మార్కెట్ నిర్మిం చాలని అధికారులు నిర్ణయించారు.

మార్కెట్ నిర్మించాలి..



కొల్లాపూర్‌లో మామిడి సాగుచేసే రైతులు వేల సంఖ్య లో ఉన్నారు. ప్రభు త్వం రైతులను పట్టిం చుకోవాలి. మామిడి మార్కెట్ ఏర్పాటుచేస్తామని కొన్నేళ్లుగా చెబు తున్నారు. కానీ మార్కెట్ నిర్మించడం లేదు. ప్రైవేటు మార్కెట్లలోనే రైతులు పంట అమ్ము కుంటున్నారు. ఈ అంశంపై ప్రజాప్రతినిధు లు చిత్తశుద్ధితో వ్యవహరించాలి. రైతులంద రికీ ఉపయోగపడేలా మార్కెట్ ఏర్పాటు చేయాలి. ఈ ఏడాది పంట నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– బాలచంద్రయ్య, మామిడి రైతు, కొల్లాపూర్

అధికారులకు నివేదించాం..



మామిడి మార్కెట్ నిర్మాణం మార్కెటిం గ్ శాఖ పరిధిలోనిది. మార్కెట్ నిర్మాణానికి అనువైన స్థల సేకరణ కోసం కొంతకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. నియోజకవ ర్గంలో మామిడి సాగు, దిగుబడి, మార్కెటిం గ్ అంశాలను గతంలో ఉన్నతాధికారులకు నివేదించాం. రైతులు పంటను అమ్ముకునేం దుకు హైదరాబాద్‌తో పాటు పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్‌లోని ప్రైవేటు మార్కెట్‌లకు వెళ్తున్న విషయాలను కూడా తెలియజేశాం.

– లక్ష్మణ్, ఉద్యానశాఖ అధికారి, కొల్లాపూర్

ముగిసిన 'పది' పరీక్షలు

- చివరిరోజు 12,739 మంది విద్యార్థుల హాజరు



నవాబుపేటలో పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గత పదిరో జులుగా జరిగిన ఎస్సెస్సీ పరీక్షలు బుధవారం ముగిశాయి. ఈ మేరకు చివరి రోజు సోషల్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 12,776 మంది విద్యార్థులకు గాను.. 12,739 మంది హాజరవగా.. 37 మంది గైర్హాజర య్యారు. గురువారం 9 పరీక్ష కేంద్రాల్లో ఒక సబ్జె క్టుకు సంబంధించి ఒకేషనల్ పరీక్ష జరగనుంది. అసలు పరీక్షలు ముగియడంతో విద్యార్థులు హాస్టళ్లు, రూంలను ఖాళీ చేసి ఇంటి బాట పట్టారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. కాగా.. ఇప్పటికే జవాబుపత్రాల మూల్యాంకణం ప్రారం భం కాగా.. జిల్లాకేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో వ్యాల్యుయేషన్ క్యాంపును విద్యా శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం వ్యాలు వేషన్‌కు 2.40 లక్షల పేపర్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.90 లక్షల పేపర్లు వచ్చాయి.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి


నవీన్ (ఫైల్)

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన కార్మికుడు మృతిచెందిన ఘటన మండలంలోని వీరాపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. వెంకటోనిపల్లికి చెందిన నవీన్(35) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం వీరాపురంలో ఓ ప్రైవేటు భవన నిర్మాణానికి కొంత మంది కార్మికులతో కలసి సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా ఐరన్ రేకులు విద్యుత్ వైర్లపై పడ్డాయి. అక్కడే పనులు చేస్తున్న నవీన్‌కు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు విద్యుత్ సరఫరాను నిలిపేసి రక్షించే ప్రయత్నం చేయగా ఫలితం లేకుండాపోయింది. మృతుడి భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

విద్యుత్ మోటార్ నాచును తొలగిస్తుండగా..

పాన్‌గల్: విద్యుత్ షాక్‌తో రైతు మృతిచెందిన సంఘటన బుధవారం పాన్‌గల్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం రేమద్దుల గ్రామానికి చెందిన కిల్లె పర్వతాలు(47)కు ఐదు ఎకరాల పొలం ఉంది. ఆ పొలం అంచున కేఎల్‌ఐ డీ–8 కాల్వ ఉండగా.. ఆ కాల్వలో విద్యుత్ మోటార్ వేసి పొలానికి సాగునీరు పారిస్తున్నాడు. ఇదే క్రమంలో మంగళవారం రోజు సాయంత్రం పొలానికి వెళ్లి కరెంట్ లేదనుకొని కాల్వలోని విద్యుత్ మోటార్‌కు పట్టిన నాచు తొలగిస్తుండగా.. విద్యుదాఘాతంతో కాల్వలోనే పడిపోయాడు. పరిసరాల రైతులు గమనించి.. కాల్వలో పడిపోయిన పర్వతాలును బయటికి తీయగా అప్పటికే చనిపోయాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బాలపీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి


ఎర్రి మానస్

మద్దూరు: ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందు ఏర్పాటుచేసిన నీటి సంపులో పడి నాలుగేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని దమ్‌గాన్‌పూర్‌లో బుధవారం చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఎర్రి మానస్(4) బాలుడు ఇంటి ముందు ఆడుకుంటూ నీటి సంప్‌లో పడిపోయాడు. ఇంట్లో పనిలో ఉన్న తల్లి, నాయనమ్మ ఆలస్యంగా బాలుడు సంపులో పడిపోయిన విషయం గ్రహించి వెంటనే మద్దూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఎర్రి మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవసరాలకు డబ్బు ఇవ్వలేదని యువకుడి ఆత్మహత్య

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ ఎం.వేణు కథనం ప్రకారం.. అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన గొల్ల శివ(32) కూలీ పనులు చేసి జీవనం సాగించేవాడు. అప్పుడప్పుడు తన అవసరాల కోసం తల్లితో డబ్బులు తీసుకునేవాడు. ఈక్రమంలో ఇదే విషయంలో మంగళవారం రాత్రి తల్లితో గొడవపడి మనస్తాపానికి గురయ్యాడు. అదే రోజు రాత్రి 44వ నంబర్ జాతీయ రహదారి సమీపంలోని సోలార్ గేట్ వద్ద క్షణికావేశంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.వేణు తెలిపారు.

సారా స్థావరాలపై దాడి

ఊర్కొండ: మండలంలోని తాగూర్తండా, అమ్మపల్లితండా, మతంతండాల్లో సారా తయారీ, అమ్మకం స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపారు. ఈ క్రమంలో సుమారు 300 లీటర్ల బెల్లం పాకం ధ్వంసం చేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని తాగూర్ తండాకు చెందిన రమావత్ రవిపై కేసు నమోదు చేశారు. అక్రమంగా సారా తయారు చేసినా, అమ్మినా, అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, సిబ్బంది యాదగిరి, రఘు, నార్య, మాధవి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల హడల్

సెర్ప్‌లో కీచక ఉద్యోగి
- లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ
- చట్ట, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ విన్నపం
- ఆందోళనలో ఉద్యోగులు
- సారొస్తే మటన్, చికెన్ బిర్యానీ తినిపించాల్సిందే


అడిషనల్ డీఆర్‌డీఓపై డీఆర్‌డీఓకి ఫిర్యాదు చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

నారాయణపేట: సెర్ప్ మహిళా ఉద్యోగులు అడిషనల్ డీఆర్‌డీఓ అంటేనే హడలెత్తిపోతున్నారు. లైంగికంగా వేధిస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నాడు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న నారాయణపేట జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓపై చట్ట, శాఖాపరమైన చర్యలు చేపట్టాలని బుధవారం సెర్ప్ ఉద్యోగులు డీఆర్‌డీఓ మొగులప్పకు విన్నవించడంతో జిల్లా అంతటా చర్చానీయాంశంగా మారింది. జిల్లాలో సెర్ప్ సంస్థకు, సిబ్బందికి చెడ్డపేరు తెస్తూ సంస్థ పరువు తీస్తున్నాడంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వామ్మో ఇంత మాట అన్నాడా..

సెర్ప్ ఉద్యోగుల గ్రీవెన్స్ సరిచేయుటకు సీఈఓ సెర్ప్ సైట్‌లో తప్పులుగా ఉన్న ఉద్యోగుల సమాచారాన్ని సరిచేయుటకు జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటుచేసి అట్టి తప్పులను ఒరిజినల్ సర్టిఫికెట్స్ తనిఖీ చేసి మార్చి15 నాటికి కలెక్టర్ అప్రూవల్ తీసుకొని సెర్ప్ పంపాల్సి ఉంది. అందుకు సంబంధించిన ఫైల్‌ను సంబంధిత అధికారులు మార్చి 29వ తేదీ మధ్యాహ్నం అడిషనల్ డీఆర్‌డీఓ దగ్గరకు తీసుకుపోగా(మూడు రోజులు వరుస సెలవులు రావడంతో) వారిని అసభ్య పదజాలంతో దూషించడంతో డీఆర్‌డీఓ ముందు డీపీఎంలు చెప్పారు. సదరు అధికారి వామ్మో అంత మాట అన్నాడా అంటూ ఆరా తీశారు. అందుకు అవమానంగా భావించిన సంబంధిత అధికారులు ఏమి మాట్లాడలేక వెనుదిరిగినట్లు వివరించారు. ఇలాంటి మాట్లాడరాదు.. కానీ ఇలా మాట్లాడితే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ చెప్పుకొచ్చారు.

నారాయణపేట జిల్లాకు రాకముందు..

అడిషనల్ డీఆర్‌డీఓ నారాయణపేట జిల్లాకు రాకముందు రాజన్న సిరిసిల్ల జిల్లాలో పని చేశారు. ఆ సమయంలో జిల్లాలోని మహిళా ఉద్యోగులను లైంగికంగా, మానసికంగా వేధింపులకు గురిచేశాడు. అక్కడి ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఇలాంటి వ్యక్తి సెర్ప్ సంస్థలోనే ఉండకూడదని విధుల నుంచి తొలగిద్దామని నిర్ణయం తీసుకోగా, భార్యాబిడ్డలను అడ్డు పెట్టుకొని ఒకటిన్నర సంవత్సరం పాటు సస్పెన్షన్‌లో ఉన్నాడు. తర్వాత నారాయణ పేట జిల్లాకి బదిలీ అయ్యాడు. ఇక్కడ కూడా అదే తీరులో వ్యవహరిస్తున్నాడు.

దినదిన గండంగా..

జిల్లాలోని స్వశక్తి మహిళలు, మహిళా ఉద్యోగులు మానసికంగా ఇబ్బందులకు గురవుతూ దినదిన గండంగా కాలం వెల్లదీస్తున్నారు. సార్ మండలానికి వస్తే చికెన్, మటన్ బిర్యానీ తినిపించాల్సిందే. లేదంటే వేధింపులు తప్పవు. సారూ టార్చర్ తట్టుకోలేక ఓ ఉద్యోగి సైతం అనారోగ్యంతో మానసిక క్షోభతో చనిపోయాడు. జిల్లాకు వచ్చిన నాటి నుంచి వెహికిల్ వాడకుండా డీపీఎంల వెహికల్ వాడుతూ అక్రమంగా నెలకు రూ.33 వేలు డబ్బులు కాజేస్తున్నట్లు పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మహిళా ఉద్యోగుల్ని లైంగికంగా, మానసికంగా వేధిస్తున్న అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మహిళా ఉద్యోగులు వేడుకుంటున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులు, డీపీఎంఈలు మాసన్న, ఆనందం, జయన్నలతో పాటు జాక్ నాయకులు నారాయణ, ఎల్1, ఎల్2 యూనియన్ నాయకులు సందప్ప, గంగాధర్, సుమతి, శ్రీనివాస్‌ల తోపాటుగా ఇతర సిబ్బంది హాజరయ్యారు.

పీయూ సిబ్బందికి ఈపీఎఫ్ సదుపాయం


పీయూ వీసీకి కృతజ్ఞతలు తెలుపుతున్న నాన్‌టీచింగ్ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ సిబ్బందికి గత కొన్నేళ్లుగా ఈపీఎఫ్ సదుపాయం లేకపోవడంతో వీసీ శ్రీనివాస్ చొరవతో ఈపీఎఫ్ సదుపాయాన్ని కల్పిస్తూ ఇటీవలి జరిగిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ నాన్‌టీచింగ్ సంఘం నాయకులు వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా లేని ఈపీఎఫ్ సదుపాయాన్ని వీసీ చొరవ తీసుకుని కల్పించడం గొప్ప విషయమన్నారు. సిబ్బంది అనారోగ్యం పాలైతే రూ.లక్షల్లో ఖర్చు చేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నారని, ఈ సదుపాయం కల్పించడం వల్ల ఇబ్బందులు తప్పనున్నాయని పేర్కొన్నారు. సిబ్బందికి వేతనాలు సైతం గత కొన్నేళ్లుగా పెంపుదల లేదని, వాటిని త్వరలోనే పెంచేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వీసీ చెప్పడం హర్షించదగ్గ విషయం అన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6,739



జడ్చర్ల/ నవాబుపేట: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ.6,739, కనిష్టంగా రూ.4,891 ధరలు లభించాయి. అలాగే కందులు గరిష్టంగా రూ.6,895, కనిష్టంగా రూ.5,200, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,289, కనిష్టంగా రూ.1,951, జొన్నలు గరిష్టంగా రూ.4,201, కనిష్టంగా రూ.3,600, ఆముదాలు రూ.6,331, పెబ్బర్లు గరిష్టంగా రూ.5,301, కనిష్టంగా రూ.4,851, ధాన్యం హంస గరిష్టంగా రూ.2,151, కనిష్టంగా రూ.1,869, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,080, కనిష్టంగా రూ.2,041, రాగులు రూ.3,777, చింతగింజలు రూ.3,319 చొప్పున వచ్చాయి.

చింతపండు క్వింటాల్ రూ.12,308

నవాబుపేట మార్కెట్ యార్డుకు బుధవారం 82 క్వింటాళ్ల చింతపండు రాగా గరిష్టంగా రూ.12,308, కనిష్టంగా రూ.6,680 ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి రమేష్ తెలిపారు. కాగా వేరుశనగ 220 క్వింటాళ్లు రాగా.. క్వింటాల్ సరాసరిగా రూ.6,265 పలికిందని వివరించారు.

హెచ్‌సీయూ భూముల వేలం దారుణం


పీయూలో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ రాష్ట్రానికే తలమానికమైన హెచ్‌సీయూలో భూములను ప్రభుత్వం లాక్కోవడం దారుణమైన విషయమన్నారు. 1,800 ఎకరాల భూమి వందలాది రకాల పక్షులు, జంతువులకు నివాసంగా ఉందని, చెరువులు, ఇతర జీవజాతులు ఉన్నాయని, అలాంటి భూములను ప్రభుత్వం అమ్మడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్య భవిష్యత్‌లో విద్యను అంధకారం చేయడం ఖాయమన్నారు. వెంటనే ప్రభుత్వం భూముల అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, విష్ణు, సతీష్, రవికుమార్, వేణు, నందిని తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తామామలపై బుధవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. అచ్చంపేటకు చెందిన ఈశ్వరమ్మకు మండలంలోని నడింపల్లికి చెందిన మల్లేష్‌తో వివాహమైంది. గత కొన్ని రోజులుగా అదనపు కట్నం తీసుకురావాలని ఈశ్వరమ్మను భర్తతోపాటు అత్త, మామ, మరిది వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై బాధితురాలు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పోటెత్తిన వినియోగదారులు

- దేవరకద్ర మార్కెట్లో జోరుగా ఉల్లి వ్యాపారం
- దాదాపు ఆరు వేల బస్తాల అమ్మకం


ఉల్లి కొనడానికి వచ్చిన వినియోగదారులతో సందడిగా ఉన్న దేవరకద్ర మార్కెట్

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌కు బుధవారం వినియోగదారులు పోటెత్తారు. వివిధ గ్రామాల నుంచి వందలాది మంది వినియోగదారులు ఉల్లిని కొనడానికి పోటీ పడ్డారు. మార్కెట్‌లో ఎక్కడ నాణ్యంగా ఉన్న ఉల్లి కుప్ప కనిపిస్తే అక్కడ వినియోగదారులు గుమికూడి ఉల్లిని కొనుగోలు చేశారు. ఉగాది తరువాత దిగుబడిగా వచ్చే ఉల్లి నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉండడంతో చాలా మంది వినియోగదారులు ఉల్లిని కొనడానికి రావడంతో మార్కెట్ అంతా సందడిగా కనిపించింది. మార్కెట్‌కు దాదాపు ఆరు వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. మధ్యాహ్నం వరకు వచ్చిన ఉల్లిలో సగం కుప్పలకు కూడా వేలం జరగలేదు. దీంతో వ్యాపారులే వేలం వేయని మిగతా ఉల్లి కుప్పలకు నేరుగా ధరలు నిర్ణయించి కొనుగోలు చేశారు. కొందరు రైతులు వ్యాపారులను మధ్యవర్తులుగా చేసుకొని ఉల్లి బస్తాలు చేసి అమ్ముకున్నారు. ఇక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు వేలం ద్వారా ఉల్లిని కొనుగోలు చేయగా చిరు వ్యాపారులు కూడా స్థానిక వ్యాపారుల నుంచి ఉల్లిని కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్లో ఉల్లి వ్యాపారమే కొనసాగింది. ఒక పక్క వినియోగదారులు, మరో పక్క వ్యాపారులతో మార్కెట్ కళకళలాడింది.

నిలకడగా ఉల్లి ధరలు..

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగే వేలంలో ఉల్లి ధరలు నిలకడగానే ఉన్నాయి. రెండు వారాలుగా దిగి వచ్చిన ధరలే ఈ వారం వచ్చాయి. ఉదయం 10గంటలకే ఉల్లి వేలం ప్రారంభం కాగా క్వింటాల్ ఉల్లి గరిష్టంగా రూ.1800 వరకు పలికింది. కనిష్టంగా రూ.1200 వరకు ధర వచ్చింది. మార్కెట్ నిబంధనలు సడలించిన తరువాత ఉల్లి బస్తా 50 కేజీలుగా నిర్ణయించారు. బస్తా ధర గరిష్టంగా రూ.900 వరకు విక్రయించగా, కనిష్టంగా రూ.600 వరకు అమ్మకాలు సాగించారు. మధ్యస్త ధరలు పలికిన ఉల్లి బస్తా ధర రూ.700 నుంచి రూ.800 వరకు విక్రయించగా చిన్నసైజు ఉల్లి బస్తా ధర రూ. 500 వరకు పలికింది.

ఆర్ఎన్ఆర్ ధర రూ. 2139..

దేవరకద్ర మార్కెట్‌లో మధ్యాహ్నం జరిగిన ఈ టెండర్లలో ఆర్ఎన్ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 2139, కనిష్టంగా రూ.1869 గా ధరలు లభించాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ. 1809, కనిష్టంగా రూ. 1739 గా ధరలు నమోదు అయ్యావి. ఆముదాల ధర గరిష్టంగా రూ. 6011 గా ఒకే ధర లభించంది. కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద యాసంగిలో వేసిన వరి పంటలు కోతకు రావడంతో రైతులు వరి ధాన్యం అమ్మకానికి తెస్తున్నారు. బుధవారం మార్కెట్‌కు దాదాపు మూడు వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

ముగ్గురు వైద్య విద్యార్థులపై చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం: గత నెల 25న ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు సీనియర్ విద్యార్థులు హర్షవర్ధన్, హిమవర్ధన్, లోకేష్‌లను సస్పెండ్ చేశారు. జూనియర్ విద్యార్థిపై దీపక్‌శర్మను పై ముగ్గురు సీనియర్ విద్యార్థులు వేధింపులకు పాల్పడటంతో బుధవారం యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలో మెడికల్ కళాశాలలో దాదాపు 5గంటలపాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో బాధిత జూనియర్ విద్యార్థి దీపక్‌శర్మతోపాటు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ ఏ విధంగా చేశారనే వివరాలను యాంటీ ర్యాగింగ్ కమిటీ సేకరించింది. దీపక్‌శర్మను ముగ్గురు సీనియర్లు హాస్టల్ గదిలో గోడ కుర్చీ వేయించడంతోపాటు 5 కిలోల సిలిండర్ మోయమని ఇబ్బందులకు గురిచేయడం, ఫోన్‌లో వ్యక్తిగత ఫొటోలు షేర్ చేసుకుని తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపాల్, ఇతరులకు పంపిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని, జూనియర్ విద్యార్థి ఫోన్ పే, గూగుల్ పే యూపీఐ కోడ్ చెప్పాలని ఒత్తిడి తీసుకురావడంతోపాటు బెల్టుతో కొట్టారని బాధితుడు వెల్లడించినట్లు తెలిసింది. బాధితుడు ఇది వరకే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ముగ్గురు సీనియర్ విద్యార్థులపై కేసు నమోదు చేశారు. కౌన్సిలింగ్‌లో డీఎస్పీ బుర్రి శ్రీనివాస్, సీఐ కనకయ్యగౌడ్, ఎస్‌ఐ గోవర్ధన్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అనంతరం ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి స్పందించి జూనియర్ విద్యార్థిపై ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు సీనియర్ విద్యార్థులపై యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో చర్చించి చర్యలు తీసుకున్నామన్నారు. సీనియర్ విద్యార్థి లోకేష్ మూడు నెలలు, హర్షవర్ధన్ రెండు నెలలు, హిమవర్ధన్‌ను నెల రోజులపాటు కళాశాల నుంచి సస్పెండ్ చేశామని వెల్లడించారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలపై అత్యాచారాలు


సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కీలకమైన పదవులు సీఎం వద్ద ఉన్నప్పటికీ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ క్షీణించిందన్నారు. తక్షణమే రాష్ట్రంలో హోంమంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కమీషన్లపై ఉన్న ఆశ శాంతిభద్రతలను కాపాడటంలో లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందని, ఫలితంగా యువకులు వ్యసనాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిద్రావస్థలో ఉన్నారని, అగ్రకుల కబంధ హస్తాల్లో రాష్ట్రం నాశనం అవుతుందని ఆవేదన వెలిబుచ్చారు. భూముల పరిరక్షణ కోసం విద్యార్థి నాయకులు చేస్తున్న పోరాటాలకు బీఎస్పీ అండగా ఉంటుందని, ప్రత్యక్ష పోరాటాలకు తాము సహకరిస్తామన్నారు. సమావేశంలో నాయకులు రామచందర్, దయానంద్, శివరామకృష్ణ, ధర్మేంద్ర, చంద్రశేఖర్, పృథ్వీరాజ్, నాగన్న, యూసుఫ్, కుమార్, హర్ష కల్యాణ్ పాల్గొన్నారు.

‘విధి పరీక్ష పెట్టింది’

- దుఃఖాన్ని దిగమింగి.. హాజరైన విద్యార్థి


పరీక్షకు హాజరైన విద్యార్థి శ్రీనాథ్

గద్వాలటౌన్ : తండ్రి మృతి చెందాడనే దుఃఖాన్ని దిగమింగి ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షకు హాజరయ్యారు. ధరూర్ మండలం మార్లబీడు గ్రామానికి చెందిన శ్రీనాథ్ స్థానిక కాకతీయ టెక్నో స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్నాడు. విద్యార్థి తండ్రి కిషోర్, తల్లి పవిత్ర, చెల్లి శిరీష సోమవారం హైదరాబాద్ నుంచి గద్వాలకు కారులో వస్తున్నారు. జడ్చర్ల సమీపంలో కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో తండ్రి కిషోర్ అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి, చెల్లికి గాయాలయ్యాయి. పోస్టుమార్టం అనంతరం సోమవారం రాత్రి కిషోర్ మృతదేహాన్ని మార్లబీడు గ్రామానికి తీసుకు వచ్చారు. మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి తండ్రి కిషోర్ మృతదేహం వద్ద రోదిస్తూ కూర్చిండిపోయారు. మరోపక్క గాయాలతో తల్లి, చెల్లి తల్లడిల్లిపోతున్నారు. ఒకవైపు భవిష్యత్.. మరోవైపు దుఃఖాన్ని దిగమింగుకుంటూనే బుధవారం చివరి పరీక్ష రాయాలా.? వద్దా.? అనే సందిగ్ధంలో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. విద్యార్థి శ్రీనాథ్‌కు బంధువులు మనోధైర్యం కల్పించారు. బాధాతప్త హృదయంతో పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పుట్టెడు దుఃఖంలో సాంఘికశాస్త్రం పరీక్షకు హాజరయ్యాడు. ఈ దృశ్యం బంధువులు, స్థానికులను కంటతడి పెట్టించింది.

మతిస్థిమితం లేని మహిళ నుంచి దేవతామూర్తుల వస్తువుల స్వాధీనం


పోలీసులు స్వాధీనపర్చుకున్న విగ్రహాల వస్తువులు

లింగాల: మతిస్థిమితం లేని ఓ మహిళ నుంచి వివిధ దేవతామూర్తుల విగ్రహాలకు సంబంధించిన వస్తువులను పోలీసులు స్వాధీనపర్చుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు కథనం ప్రకారం.. లింగాలకు చెందిన ఓ మహిళ కొన్ని నెలలుగా మతిస్థిమితం కోల్పోయి స్థానికంగా తిరుగుతుంది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారు జామున మండలంలోని కోమటికుంటలో తిరుగుతున్న ఆ మహిళను గమనించిన గ్రామస్తులు ఆమె దగ్గర ఉన్న సంచిని పరిశీలించగా అందులో విగ్రహాలకు సంబంధించిన వస్తువులను చూసి వెంటనే డయల్ 100కు ఫోన్ చేయడంతో గ్రామాన్ని సందర్శించి వస్తువులను స్వాధీన పర్చుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇందులో రాతి నాగపడిగెలు, వెండి కళ్లు, మీసాలు, ఇతర పంచలోహ వస్తువులు ఉన్నాయని, మహిళను ఎంత ప్రశ్నించినా వివరాలు చెప్పడం లేదని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మహిళలను పోలీసులు వెంట పెట్టుకొని పలు ప్రాంతాలను తిరిగినా వస్తువులు ఎక్కడి నుంచి తెచ్చిందో తెలపడం లేదన్నారు. మండలంలోని ఆయా గ్రామాలు, ఇతర మండలాల్లో విగ్రహాల వస్తువులు అపహరణకు గురైతే తమ దృష్టికి తీసుకు రావాలని ఎస్‌ఐ సూచించారు.

సుంకేసుల డ్యాంలో పడి తండ్రీకొడుకులు మృతి


సులేమాన్, ఫర్హాన్, ఫైజాన్ మృతదేహాలు

రాజోళి: సరదాగా ఈతకు వెళ్లిన తండ్రీకొడుకులు సుంకేసుల డ్యాంలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని కర్నూలు జిల్లా లక్ష్మీనగర్‌కు చెందిన సులేమాన్(47) కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సుంకేసుల డ్యాంకు వచ్చారు. కొడుకులు ఫర్హాన్(11), ఫైజాన్(9)తో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు సుంకేసుల డ్యాం వద్ద నదిలోకి దిగారు. అయితే ప్రమాదవశాత్తు ఇద్దరు నీటిలో కొట్టుకుపోతుండగా.. గమనించిన తండ్రి సులేమాన్ వారిని కాపాడేందుకు వెళ్లి నీటిలో మునిగిపోయాడు. అనంతరం డ్యాంలోని 25వ గేటు సమీపంలో వారి మృతదేహాలు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు మృతదేహాలను వెలికితీశారు. తండ్రీకొడుకులు ఒకే ఘటనలో మృతిచెందడంతో ఘటనా స్థలంలో ఉన్న కుటుంబీకులు కన్నీటిపర్యంతమయ్యారు.

రామన్‌పాడులో 1016 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,016 అడుగులకు నీటిమట్టం చేరిందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగిందని... సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు 22 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 83 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS OFFER

■ శ్రీగోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9010190666

WANTED

■ HYDలోని 5స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు కేటరింగ్ బాయ్స్ & హెల్పర్స్ కావలెను. జీ: 12-16K రూమ్+ఫుడ్ కన్సల్టెన్సీ కాదు. Age: 18-30, 9989978685

■ ప్రైవేట్ మినీ బ్యాంకులలో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్ కావలెను. స్థలం. Clock Tower & గణేష్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా. 9704013331, 0870-3569177.

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899

భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం/సంప్రదింపులు మా పాఠకులు కోరదగినది. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్